విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 23 మే 2025 8 పేజీలు

ముంపు సమస్యలు లేకుండా

సత్వర చర్యలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

విశాలాంధ్ర - కాకినాడ : గత సంవత్సరం వరదల కారణంగా ఏలేరు వ్యవస్థలోని కాల్వలకు పడిన గండ్లు అన్నింటినీ వర్షాకాలం ప్రారంభానికి ముందే పూడ్చి ఖరీఫ్ పంటలకు నీటి సరఫరా, ముంపు సమస్యలు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలతో కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీ చేసారు. సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్ సగిలి కడపటి డిఆర్సీ సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు. కమిటీ ▶మిగతా 2లో..

నాలా రద్దు...

- నిర్మాణ రంగానికి ఊరట
- భూ మార్పిడికి కొత్తచట్టం

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: జిల్లాలో ఇప్పుడిప్పుడే స్థిరాస్తి నిర్మాణరంగం బాలారిష్టాలతో ముందుకెళ్తున్నది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి పూర్తిగా వెనకబడి పోయింది. కొత్త చట్టంతో కొంతమేర ముందుకు వెళ్లే అవకాశం ఉంది. నాలా చట్టాన్ని రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో అవినీతి దందాకు అడ్డుకట్ట పడనున్నది. ఇకపై వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకునేలా మార్చుకునేందుకు ప్రజలు తహసిల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిన పనిలేదు. స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లించాల్సిన పని ఉండదు. భవన నిర్మాణాల అనుమతుల కోసమో,పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్నప్పుడే భూ వినియోగ మార్పిడికి కూడా సింగిల్ విండో విధానంలో అనుమతి చేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకురానున్నది. ఇప్పటి వరకు సామాన్యులు ఇల్లు కట్టుకోవాలన్నా, భూ వినియోగ మార్పిడి కోసం చాలా శ్రమపడాల్సి వస్తుంది. భవన నిర్మాణదారులు స్థిరాస్తి వ్యాపారులు ల్యాండ్ కన్వర్షన్ కోసం,ప్రజాప్రతి నిధులు,రెవెన్యూ సిబ్బందికి చెల్లించే ముడుపులు భారాన్ని తిరిగి సాధారణ వినియోగదారులపైనే వేస్తున్నారు.

> ‘ నిర్మాణ రంగంలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతున్న కూటమి ప్రభుత్వం జిల్లాలో పారిశ్రామికవేత్తలు, పర్యాటక రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి, ఆకర్షించడానికి సరికొత్త సింగిల్ విండో పథకానికి రూపకల్పన చేస్తున్నది. నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్స్ అసెస్మెంట్ యాక్ట్ (నాలా)ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థిరాస్తి, నిర్మాణ, పారిశ్రామిక, పర్యాటక రంగాలలో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు తోడ్పడుతుంది. ’

ప్రజా ప్రతినిధి అంగీకరిస్తేనే భూ మార్పిడి

జిల్లాలో గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఎకరానికి రూ. 5 లక్షల వరకు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు బహిరంగంగానే దండుకున్న విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదు. వ్యవసాయ భూములలో నిర్మాణాలు చేపట్టాలన్నా, లేఅవుట్లు వేయాలన్నా,పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా, చివరకు పెట్రోల్ పంపు వంటివి కట్టాలనుకున్నా నాలా చట్టం కింద వ్యవసాయేతర భూములుగా మార్చుకోవాలి. ప్రభుత్వానికి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ ఆ భూములను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉంటే వ్యవసాయేతర భూములుగా మార్చవచ్చని రెవెన్యూ డివిజనల్ అధికారికి ▶మిగతా 2లో..

హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- మాతా, శిశు మరణాలు అరికట్టాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో మాతా,శిశు మరణాలు సంభవించకుండా కృషిచేయాలని, గత మరణాలను సమగ్రంగా విశ్లేషించి పూర్తిస్థాయిలో మరణాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో వైద్య,ఆరోగ్యశాఖ జిల్లా అధికారులతో కలిసి జిల్లాలో చోటుచేసుకున్న మాతా,శిశు మరణాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏతల్లీ జన్మనిస్తూ మరణించకూడదు, ఏ బిడ్డా జన్మిస్తూ మరణించకూడదనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అక్టోబరు 2024 నుంచి మార్చి 2025 వరకు చోటుచేసుకున్న 8 మాతృమరణాలు, 7 శిశు మరణాలకు సంబంధించి నివేదికలను పరిశీలించారు. వీటిపై ప్రత్యేకంగా చర్చించి కారణాలను వెలికితీయాలని ఆదేశించారు. తిరిగి ఆ మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు ప్రతి ఆశా, ఆరోగ్యకార్యకర్త, హెల్త్ సూపర్ వైజర్ నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు.ఐసిడిఎస్ సిబ్బంది పౌష్టికాహారం అందిస్తూ రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రివెంటబుల్ మరణాలు సంభవించిన సందర్భాల్లో సీనియర్ వైద్యాధికారులతో విచారణ చేసి కేసు స్టడీ ▶మిగతా 2లో..

కార్యకర్తలకు ఆర్థిక భరోసా

టీడీపీ కాకినాడ జిల్లా మహానాడులో వక్తలు

విశాలాంధ్రబ్యూరో- కాకినాడ : టీడీపీ నిర్వహించిన కాకినాడ జిల్లా మహానాడు-2025 విజయవంతమైంది. ఈ మహానాడులో పలువురు నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. గురువారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో నిర్వహించిన కాకినాడ జిల్లా టీడీపీ-2025 మహానాడును ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీ రామా రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు ఘన నివాళి ▶మిగతా 2లో..

భవిష్యత్తు పర్యాటక రంగానిదే

రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

విశాలాంధ్ర-కాళ్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగంలో ఐదేళ్లలో దేశంలో ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు లక్ష్యంగా పెట్టుకుని పర్యాటక రంగానికి పారిశ్రామిక హొదా కల్పించి, పలు పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కోపల్లె మంతెన హెరిటేజ్‌లో రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రాష్ట్రంలో హెూం స్టే ▶మిగతా 2లో..

యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నెల రోజులపాటు యోగా సాధన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ పి. ప్రశాంతి తెలియజేశారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం పై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్, జెసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జూన్ 21న రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మందితో రికార్డు స్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంలో భాగంగా నగరంలోని వై జంక్షన్ నుంచి లాలాచెరువు వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 మధ్య యోగా సాధన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యోగాపై స్ఫూర్తిదాయకమైన కథనాలను అందించాలని మీడియాకు సూచించారు. యోగా ద్వారా చక్కని జీవనశైలి, మానసిక ఉల్లాసం కలగటమే కాక జీవన క్రమశిక్షణ కూడా అలవడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జైళ్ళ ఎస్పీ రాహుల్, డిఆర్‌ఓ సీతారామమూర్తి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు అశోక్

విశాలాంధ్ర -నూజివీడు :నూజివీడు మండల వైసీపీ ముఖ్య నాయకులు పొట్లూరి అశోక్ ,జంగంగూడెం గ్రామ సర్పంచ్ పొట్లూరి అంజనీ కుమారి, ఉప సర్పంచ్ మందపాటి నాగరాజుతో పాటు 10మంది గ్రామ వార్డు మెంబర్లు,200 మంది అనుచరులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి విచ్చేసిన మంత్రి పార్థసారధిని ట్రాక్టర్లు, ఆటోలు,కార్లు,ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా వెళ్లి ఆహ్వానించి భారీగా బాణాసంచాలు కాలుస్తూ జంగంగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు ఎన్టీఆర్ విగ్రహాలను ప్రారంభించారు. అనంతరం పొట్లూరి అశోక్ ,గ్రామ సర్పంచ్ అంజనీ కుమారి, వార్డు మెంబర్లను, అనుచరులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి పార్థసారథి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జంగంగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు,తెలుగు యువత మాజీ అధ్యక్షులు వల్లభనేని భాస్కర్, టీడీపి నాయకులు చెరుకూరి దుర్గాప్రసాద్, కాపా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటక రంగానిదే (1వ పేజీ తరువాయి)

విధానాన్ని అభివృద్ధి చేస్తూ, పర్యాటకులకు చక్కని అనుభూతి, తియ్యని జ్ఞాపకాలను పదిలం చేస్తుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1,842 హోం స్టే యూనిట్లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఈ విధానానికి పశ్చిమగోదావరి జిల్లా కోపల్లెలోని మంతెన హెరిటేజ్ హోం స్టేను ఆదర్శంగా నిలిచిందన్నారు. పర్యాటకులను మరింత ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్‌నెస్, అగ్రిటూరిజంలను కలుపుతూ ప్రభుత్వం టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పోలవరం నుంచి పట్టిసీమ మధ్య తీగల వంతెన, విజయవాడలోని భవానీ ద్వీపంలో థీమ్‌పార్క్, వాటర్‌పార్క్ లాంటివి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఏ.లాజ్ వంతినాయుడు, మేనేజరు ఎ.రాజ్యలక్ష్మి, కన్సల్టెంటు డి.సాహితి, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా (1వ పేజీ తరువాయి)

అర్పించారు. టీడీపీ జెండా మోసి అశువులు బాసిన కార్యకర్త లకు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు కొంత సేపు మౌనం పాటించారు. మహానాడు కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యేలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వరుపుల సత్యప్రభ, వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), నిమ్మకాయల చినరాజప్పలతో పాటు ఇన్చార్జిలు, ప్రముఖులుగా వ్యవహరిస్తున్న వారు ఆయా నియోజవర్గలలో ఉన్న సమస్యలను లేవనెత్తారు. వారిలో ముఖ్యంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఆకట్టుకుంది. కాకినాడ జిల్లాలో గతంలో 21 మంది ఎమ్మెల్యేలు ఉండేవారని తామంతా సమిష్టి నిర్ణయాలను తీసుకొని రాష్ట్రస్థాయిలో తెలియజేసే వారన్నారు. అందుకు దానికి ప్రతిస్పందన వచ్చి జిల్లా అభివృద్ధికి బాసటగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఉన్న కాకినాడ జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడిందని జిల్లాపై అభివృద్ధి నిమిత్తం కూర్చొని చర్చించుకున్న సంఘటన లేదన్నారు.

ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గత సీఎం జగన్ తన అవివేకంతో నాశనం చేసి రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారన్నారు. 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు. గత సీఎం జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేశారని ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితిని చంద్రబాబు చక్కబెడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు చిక్కాల రామచంద్రరావు, ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి సత్తిబాబు, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీఆర్తో కలిసి పని చేసిన సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్ర రావు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూలను ఘనంగా సన్మానించారు.

శ్రద్ధ పెట్టాలి (1వ పేజీ తరువాయి)

చేయాలన్నారు. బాల్యవివాహాలు మూలంగా మాతృ మరణాలు సంభవించే అవకాశం ఉన్నందున ఇటువంటి విషయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లాలో నూరు శాతం ఇమ్యునేజేషన్ కార్యక్రమం జరగాలన్నారు.

సమావేశంలో డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్ కుమార్,డిఎంహెచ్ఓ డా. ఆర్. మాలిని,ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డా. రాజీవ్,ఐసిడిఎస్ పిడి పి.శారద డిఐవో డా.నాగేశ్వరరావు,పలు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, పలువురు మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలా రద్దు (1వ పేజీ తరువాయి)

సిఫారసు చేస్తారు. ఆర్డీవో ఆదేశాలు జారీ చేస్తారు.దీన్ని రెవిన్యూ అధికారులు కొందరు అప్పటి ప్రజాప్రతినిధులు కాసులు కురిపించే దందాగా మార్చుకున్నారు. తమకు తెలియ కుండా ఒక ఎకరం కూడా భూ వినియోగ మార్పిడి చేయడానికి వీలులేదని తహసీల్దారు లకు గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు హుకుం జారీ చేశారు. దీంతో ఎవరైనా ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే తొలుత ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధిని కలిసి వస్తేనే దస్త్రం ముందుకు కదులుతుందని తహసీల్దార్లు నిర్మొహమాటంగా చెప్పేవారు.

కప్పం కడితేనే అనుమతులు

వైకాపా హయాంలో జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాంతాలవారీగా ధర నిర్ణయించారు. నియోజకవర్గ కేంద్రానికి దగ్గరలో భూమిలయితే ఎకరానికి రూ.10లక్షలు, దూరంగా ఉన్న భూములైతే ఎకరానికి రూ.5 లక్షలు ప్రజాప్రతినిధులకు కప్పం కడితేనే తహశీల్దార్ కార్యాలయంలో ఫైలు ముందుకు కదిలేది కాదు. ప్రజా ప్రతినిధులకు డబ్బులు చెల్లించలేక చిన్న చిన్న వ్యాపారస్తులు వ్యాపారం చేయటాన్ని పూర్తిగా విరమించుకున్నారు. గతంలోలా ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే వ్యాపారాలు చేయలేమంటూ విరమించుకున్నారు. గతంలో ల్యాండ్ కన్వర్షన్ కు దరఖాస్తు చేసుకుంటే అందరికీ ముడుపులు చెల్లించినప్పటికీ అనుమతులు రావడానికి 60 నుంచి 90 రోజులు పట్టేది.

15 రోజులలో అనుమతి

నూతనంగా సింగిల్ విండో విధానం అందుబాటులోకి వస్తే మొత్తం అనుమతులు 15 రోజులలో వచ్చేలా ప్రభుత్వం నూతన ప్రణాళికలను సిద్దం చేస్తుంది. నాలా చట్టం రద్దుకు ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరితగతిన ఈ విధానం అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.దీంతో తీర ప్రాంతాలలో పారిశ్రామికవేత్తలు, జిరాస్తి నిర్మాణరంగంలో పెట్టుబడులు పెట్టటానికి ముందుకు వచ్చే అవకాశం ఉంది. పారిశ్రామికంగా, పర్యాటకంగా జిల్లా అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు అవకాశాలు అందుబాటులోకి వస్తాయని జిల్లా ప్రజానీకం ఎదురుచూస్తుంది.

సత్వర చర్యలు (1వ పేజీ తరువాయి)

సూచించిన అంశాలలో 75 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా జిల్లాలో పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి పథకం క్రింద జిల్లాలో 75 వేల రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా చేపట్టి ఇందులో 52 వేల యూనిట్లను ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు ఏర్పాటు చేయనున్నా మని తెలిపారు. కిసాన్ డ్రోన్‌ల వల్ల రైతులకు, డ్రోన్ యజమానికి చేకూరే ఆర్థిక ప్రయోజనాలపై క్షేత్ర పరిశీలన చేసామని, డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు ఖర్చులు, సమయం ఆదా అవుతుండగా, డ్రోన్ నిర్వాహకుడికి ఏడాదికి దాదాపు 6.33 లక్షలు ఆదాయం చేకూరుతోందని అధ్యయనంలో నిర్ధారణ అయిందన్నారు. జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగ మేళాల నిర్వహణ ద్వారా జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ఆవాసాల్లో వేసవి త్రాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలను కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వివరించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చర్చలో పాల్గొంటూ గతేడాది వరదల వల్ల ఏలేరు వ్యవస్థలో పడిన గండ్లను వెంటనే పూడ్చించాలని, సామర్లకోట బైపాస్ రోడ్డు, ఎడిబి రోడ్డు విస్తరణ పనులను సత్వరం పూర్తి చేయాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ అక్వా చెరువుల వ్యర్థజలాల వల్ల పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని కోరారు. పిఠాపురం నియోజకవర్గం నుండి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ మిల్లర్లు కుమ్మకై తక్కువ ధర చెల్లిస్తున్నందున నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరగా, అకాల వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడుకునేందుకు మరింత ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు రైతులకు పంపిణీ చేయాలని జనసేన నియోజక వర్గ ఇన్ఛార్జి మర్రెడ్డి శీనివాస్ కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొం టొన్న హాస్టల్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. జయలక్ష్మి మాక్ సొసైటీ, కిర్లంపూడి, ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో జరిగిన అక్రమాలపై సత్వర చర్యలు చేపట్టి నష్టపోయిన ముదుపరులను, రైతులను ఆదుకోవాలని ప్రజాప్రతినిధులందరూ కోరారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులు, ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ సభ్యులు చర్చించిన అంశాలపై సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏలేరు సాగునీటి వ్యవస్థలోని కాలువలకు గతేడాది వరదల సమయంలో పడిన గండ్లన్నిటినీ ఖరీఫ్ సాగు మొదలైయ్యేలోపు పూడ్చాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పియం సూర్యఘర్ పథకం క్రింద టిడ్కో గృహాలపైన కూడా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్ కో అధికారులను కోరారు. పటిష్టమైన వేసవి కార్యాచరణతో బోర్ల రిపోర్లు, నీటి రవాణా వంటి చర్యలతో ఏ ఆవాసంలో త్రాగునీటి ఎద్దడి కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి డిఆర్సీ సమావేశంలో చర్చించిన అంశాలను వారికి వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఎఫ్ఓ రవీంద్రనాథరెడ్డి, డిఆర్ఓ జె వెంకట్రావు, పాడా పిడి ఎ చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్, ట్రాన్స్కో ఎస్ఈ ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వేడుకలు

విశాలాంధ్ర-నూజివీడు : నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పులుసు పార్థసారధి ఆవిష్కరించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ అన్న నందమూరి తారకరామారావు పార్టీ స్థాపించిన 9 నెలలకే ప్రభుత్వం స్థాపించి పేద ప్రజలకు సేవలందించిన మహానుభావుడు అన్నారు.పేదలకు కూడు, గూడు,గుడ్డ,రూ.2 కు కిలో బియ్యం, జనతా వస్త్రాలు ఇచ్చి పేదలను అన్ని విధాలుగా ఆదుకున్న గొప్ప నాయకుడు ఎన్టిఆర్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ,పేరు ప్రఖ్యాతలను తెచ్చిన ఘనుడు ఎన్టీఆర్ అన్నారు. త్వరలో అమరావతి రాజధాని నిర్మిస్తామని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటు పరం కాకుండా కాపాడమని,ప్రభుత్వమే పరిశ్రమను నడుపుతుందని తెలియజేసారు.

భారీ వర్షం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో భారీ వర్షం పడింది. గురువారం తెల్లవారుజామున పడిన ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. దుక్కులు దున్ని పచ్చిరొట్ట విత్తనాలు చల్లే సన్నాహాలలో నిమగ్నమయ్యారు. భారీ వర్షంతో ఒక్కసారిగా మండలంలో వాతావరణం చల్లబడింది. దాదాపు రెండు దుక్కుల వర్షం పడింది. తొలకరి మొదలవ్వకుండానే పడిన ఈభారీ వర్షంతో రైతులు, ప్రజలు ఉపశమనం పొందారు.

డాక్టర్ నరేంద్ర పార్థీవ దేహానికి ఎమ్మెల్యే నివాళులు

విశాలాంధ్ర-లింగపాలెం: కే.గోకవరానికి చెందిన దంత వైద్యులు, తెలుగుదేశం నాయకుడు మండదపు నరేంద్ర పార్థీవదేహానికి చింతల పూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతి చెందిన డాక్టర్ నరేంద్ర సేవలను కొనియాడారు. దంత వైద్యునిగా మంచి పేరు పొందారని, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నరేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతి చెందిన డాక్టర్ నరేంద్ర అంత్యక్రియలలో కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామ ప్రజలు, పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో నివసిస్తున్న సోమ గంగాధర్ అనే యువకుడికి గుండె వ్యాధి అనారోగ్యం సమస్యతో బాధపడుతున్నాడు. సోమ గంగాధర్‌కు రూ.2 లక్షల 24 వేల ఒక వంద సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ ను అందజేశారు. సోమ గంగాధర్ గుండె వ్యాధి అనారోగ్యం సమస్యతో వైద్యుల ఖర్చులు నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను కలిశారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2 లక్షల 24 వేల ఒక వంద రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ ను బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పైబోయిన రఘు, చెరుకూరి జగత్ సోమశేఖర్, పాలూరి వెంకటేశ్వరరావు,వీర్ల కృష్ణ , కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కేంద్రమైన ఏలూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్ను గురువారం కలెక్టర్ కె. వెట్రిసెల్వి తనిఖీ చేశారు.ఈవిఎం గోడౌన్ వద్ద

సిసి కెమెరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం పరిశీలన రిజిస్టర్ లో కలెక్టర్ సంతకం చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు,సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించాసమన్నారు. ఎప్పటికప్పుడు గొడౌన్ క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.

రోగులకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి

ఎంతగానో దోహదపడు తుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకూ రెండుకోట్ల రూపాయల విలువైన సహాయ నిధి చెక్కులను అర్హులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 18 మంది లబ్దిదారులకు రూ.18లక్షల 13వేల 676ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అందజేశారు. వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు యోగ, ధ్యానం చేస్తే ఉపశమనం

వైద్య అధికారి డాక్టర్ కిరణ్మయి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి గర్భిణీ స్త్రీ యోగ, ధ్యానము చేయడం వలన ఉపశమనం లభిస్తుందని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి అన్నారు. గురువారం ప్రపంచ ఎక్లంప్సియా దినోత్సవ సందర్భంగా. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధిక రక్తపోటు,పై గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. అధికంగా రక్తపోటు ఉన్న గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ధ్యానము, యోగా చేయుట వలన ఉపశమనం లభిస్తుందని అన్నారు. మరో వైద్యాధికారి డాక్టర్ కమతం ఓంకార్ నాథ్ మాట్లాడుతూ గర్భిణీలు వారంలో ఐదు రోజులపాటు ,కనీసం 30 నిమిషాలు పాటు వాకింగ్ చేయుట మంచిదని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జులాది విల్సన్ బాబు,పబ్లిక్ హెల్త్ నర్స్ సిహెచ్ వి. సత్యవతి, హెచ్.వి సిహెచ్ పద్మజ, ఏ ఎన్ ఎం లు, ఆరోగ్య కార్యకర్తలు పురుషులు ఎం ఎస్ యోహాన్, ఎం. నల్లయ్య.ఏ. కృష్ణ జి. శ్రీనివాస్,ఆశ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రాలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు: యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా,మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థినీ, విద్యార్థులకు ఆయా రంగాల్లోని వారికి వివిధ పోటీలను నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల,గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో యోగా శిక్షకులను గుర్తించి అభ్యాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతిరోజు జిల్లాలోని ఏలూరు నగరంతో పాటు మున్సిపాలిటీల్లో మండలస్థాయిలో యోగా ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించాలని యంపిడివోలను కలెక్టర్ ఆదేశించారు. ద్వారకా తిరుమల హరిత హోటల్ వద్ద ఈనెల 29వ తేదీన, పోలవరం మండలం పట్టిసీమ రివర్ ఇన్ రిసార్ట్ వద్ద జూన్ 5వ తేదీన, జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవాలయంలో జూన్ 11వ తేదీన, కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గుంటుపల్లి బౌద్ధ గృహాల వద్ద, జూన్ 18వ తేదీన యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంబంధిత యంపిడివోలు ఈ కార్యక్రమాలను పర్యాటకశాఖ అధికారు లతో సమన్వయం చేసుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ సందర్శన

శాలాంధ్ర- ఉండి : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక స్టాక్ పాయింట్ సందర్శనలో భాగంగా ఉండి స్టాక్ పాయింట్ను సమగ్ర శిక్ష ఏ.పీ.సి. శ్యామ్ సుందర్ మండల విద్యాశాఖ అధికారి టు వినాయకుడితో కలిసి గురువారం సందర్శించారు. స్టాక్ వివరాలను శ్యాంసుందర్ వినాయకుడిని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ కు సంబంధించిన పలు సూచనలు, సలహాలు, వినాయకుడికి అందించారు. అక్కడినుండి ఉండిలో ఉన్న భవిత సెంటర్ను సందర్శించి భవిత సెంటర్ శిథిలావస్థలో ఉన్న చిన్నచిన్న రిపేర్లు అవసరాలను తెలుసుకొని బిల్డింగ్ రిపేరుకు కావలసిన నిధులను ఏర్పాటు చేస్తానని ఐ ఈ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యంకు హామీ ఇచ్చారు. నిధులు ఇవ్వగానే చిన్న చిన్న రిపేర్లను త్వరితగతిన పూర్తి చేయాలని శ్యాంసుందర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది మాధురి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

విశాలాంధ్ర- ఉంగుటూరు : అర్హులైన వారందరికీ రేషన్ కార్డు కలిగి ఉండాలన్నదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు.. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి తహసీల్దారులు, ఎంపీడీవోలతో ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి దగ్గర నుండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను తీసుకొని జాప్యం లేకుండా కార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు

అనంతరం ఈ కార్డుల జారీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించి, వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

యోగా ప్రయోజనాలు అపారం

విశాలాంధ్ర - నరసాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలో అంతర్జా తీయ యోగా మాసోత్సవం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం. అంజయ్య తెలిపారు. దీనిలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో మొదటిరోజు గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా ప్రయోజనాలు అపారమైనవి, విస్తృతమైనవని, క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల శారీరక బలం,సమతుల్యత మెరుగుపడతాయన్నారు. ఆరోగ్యం, శ్రేయస్సు, మానసిక స్పష్టతకు దోహద పడతాయన్నారు. ఒత్తిడిని తగ్గించి జీవిత సవాళ్లు సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, పాత్రుడు, , యోగా గురువులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా దినోత్సవం

- గర్భధారణ సమయంలో వచ్చే ప్రీ-ఎక్లంప్సియా వ్యాధి ప్రాణాంతకం
- ప్రీ-ఎక్లంప్సియా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రెగ్నెన్సీముందు లేదా ప్రెగ్నెన్సీ సమయంలో అధిక రక్తపోటు(బి.పి.) ఉంటే తక్షణమే వైద్య నిపుణులతో సలహా పొందడం తప్పని

సరి అని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మంది రంలో ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా ప్రీ-ఎక్లంప్సియా వ్యాధిపై అవగాహన కలిగించే పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ-ఎక్లంప్సియా తల్లీ, శిశువు ఇద్దరికి ప్రమాదకరంగా ఉంటుందని దీని మూలంగా మాతృ శిశు మరణాలకు కారణం అవ్వచ్చన్నారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిని నివారించ డానికి అవసరమైన చర్య లను తీసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్ర మంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ ఆర్. మాలిని, ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డిఐఓ డాక్టర్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ పిడి పి.శారద, పలువురు మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వేసిన తాడిచెట్లు తొలగించాలని ఆందోళన

విశాలాంధ్ర - టి.నర్సాపురం : తాము ఎంతో కాలంగా నడిచే రోడ్డు మార్గాన్ని కొందరు వ్యక్తులు తమదని రోడ్డుకు అడ్డంగా తాడిచెట్లు,ముళ్ళ కంప వేసి రాకపోకలు నిలిపి వేసారంటూ కేతవరం

పంచాయతీలోని బర్రె వారిగూడెం వాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్రెవారి గూడెంలో సుమారు 30 కుటుంబాలు నివాసం వుంటున్నారని వారు తెలిపారు. గత నాలుగు రోజులుగా రోడ్డు మార్గం మూసివేయడం వలన బయటకు వెళ్ళే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు మార్గాన సుమారు 40 సంవత్సరాల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బి. శైలజ ను వివరణ కోరగా రోడ్డును సర్వే చేసి ఇరువర్గాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించినట్లు ఆమె తెలిపారు.

పల్లె నిద్రలో సమస్యలు తీరేనా ?

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పల్లె వెలుగు -స్వర్ణ గ్రామ పథకంలో గ్రామాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా పల్లె నిద్ర కార్యక్రమం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఇటీవల తూర్పు వీధిలో నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా కూటమి ప్రభుత్వం తలపెట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి నియోజకవర్గం శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పల్లె నిద్ర చేసి ప్రజల సమస్యలను అతి దగ్గరగా అధికారులతో కలిసి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా అధికారులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా గ్రామ టిడిపి అధ్యక్షులు కనికళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలో మేజర్ పంచాయతీ అయిన తమ గ్రామానికి ముందుగా శాసనసభ్యులు పల్లెనిద్ర కార్యక్రమానికి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్లీవ జోజి, ఎంపీడీవో, ఈ ఓ పి ఆర్ డి, గ్రామ సర్పంచ్ యరమాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తమ గ్రామానికి వచ్చే పంట బోదె పూడ్చి వేస్తున్నారని ఎమ్మార్వోకు ఫిర్యాదు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: తమ గ్రామంలో వ్యవసాయ భూమికి నీరందించే పంట బోదెను పూడ్చి వేస్తున్నారని, వెంటనే నిలుపుదల చేయాలని పెదగరువు, చినగరువు గ్రామానికి చెందిన 90 మంది సన్న, చిన్న కారు రైతులు గురువారం భీమవరం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెదగరువు గ్రామం మీద నుండి చిన్న గరువు గ్రామానికి నీరు ప్రవహించే పంట బోదెను ఆనుకుని ఉన్న ఆ గ్రామానికి చెందిన తాళ్లూరి ప్రకాశం, భార్య సలోమి, కలసి అక్రమంగా పూడ్చివేసి పిల్లర్లు వేసి ప్రహరీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. అది కాస్త పూడ్చివేస్తే పెదగరువు, చినగరువు, గ్రామ వ్యవసాయ రైతులు తీవ్రం నష్టపోతామని అన్నారు. గతంలో ఇదే మాదిరిగా పంట బోదెను ఆక్రమించుకుని గోడ నిర్మించుకునేందుకు ఏర్పాటు చేయగా అప్పటి కలెక్టర్ ప్రశాంతికి విన్నవించగా ఆమె వెంటనే నిర్మాణం నిలుపుదల చేశారని తెలిపారు. మూడు సంవత్సరాల తర్వాత మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల తమ గ్రామానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తమను ఆ గ్రామ రైతులు విన్నవించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏలేటి ఇస్రాయేలు, జి.ఏసురత్నం, కె.ఏసేపు, యేసు రాజు, పి.సువర్ణ రాజు, కే.జాన్ మోసే పలువురు రైతులు పాల్గొన్నారు.

జనసేనలో కౌన్సిలర్లు చేరిక

విశాలాంధ్ర - నరసాపురం: జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు, నరసాపురం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ నాయకత్వం పట్ల ఆకర్షితులై నరసాపురం పట్టణం 19, 27 వార్డులు కౌన్సిలర్లు కేసరి గంగరాజు, గోరు రమాదేవి, గోరు సత్యనారాయణ, కార్యకర్తలు గురువారం జనసేనలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ మన కుటుంబ సభ్యులుగా భావించి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. నాయకుడు పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రయత్నించాలని సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయానికి వెండి తొడుగు బహూకరణ

విశాలాంధ్ర - నరసాపురం: పట్టణ పరిధి చినమామిడిపల్లి లో వేంచేసివున్న ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది కలిగినీడి చిదంబరం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి తమల పాకుల పూజ జరిపారు.ఈ సందర్భంగా స్వామివారికి మూడు కిలోల వెండి తొడుగు బహుకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కలిగినీడి వీరభద్రం, కలిగినీడి కుమార్, నిప్పులేటి శ్రీనివాస్, నల్లం సూర్యచంద్రరావు, పాలూరి ప్రసాద్, గునిశెట్టి సత్యనారాయణ, పాలూరి బాబ్జి, బల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ సరికొత్త అధ్యాయం

కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

విశాలాంధ్ర -భీమవరం: భారతీయ రైల్వే ప్రయాణ ప్రమాణాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకం సరికొత్త అధ్యాయానికి నాంది అని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. దేశవ్యాప్తంగా ఆధునికరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం రాజస్థాన్లోని బికినీర్ నుండి వర్చువల్ గా ప్రారంభించారు. అందులో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమృత్ భారత్ పథకంలో రూ.25.41 కోట్లతో ఆధునికరించిన వరంగల్ రైల్వే స్టేషన్ పునఃప్రారంభించ దం, కాకతీయుల కళలు ఉట్టిపడేలా వరంగల్ రైల్వే స్టేషన్ తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశం లోని 1300 రైల్వే స్టేషన్ లను లక్ష కోట్లతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం అమృత్ భారత్ అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ చేతుల మీదుగా జ్ఞాపికలు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ,ఎంపీలు డీకే అరుణ,ఈటల రాజేందర్, కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్లు కారాగార శిక్ష

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించడమే కాకుండా ఆమెపై పలు మార్లు అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన కేసులో ఒక వ్యక్తిపై నేరం రుజువు కావడంతో 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్వివి ఎస్.మురళీకృష్ణ తీర్పు చెప్పారు. ముద్దాయికి వరకట్నం విషయంలో ప్రోత్సహించినందుకు గాను అతని తల్లిదండ్రులకు వరకట్నం డిమాండ్ చేసిన సెక్షన్ ప్రకారం ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఈ మేరకు ఆ జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డివి.రామాంజనేయులు కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని బుట్టాయిగూడెం మండలం సూరప్పగూడెం గ్రామానికి చెందిన కోసూరి అంజి ప్రసాద్కు జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. అంజి తన ఇంటికి ఆమెను తీసుకెళ్ళి తన తల్లిదండ్రులు కోసూరి రామలక్ష్మి, కోసూరి సాంబశివరావులకు పరిచయం చేయగా, ఆమె బాగా నచ్చిందని, తన కొడుకు అంజి ప్రసాద్ తో వివాహం చేస్తామని చెప్పారు. ఈ విషయం ఆమె తన తల్లిదండ్రులకు తెలపడంతో వారి బంధువులను తీసుకుని సూరప్పవారిగూడెం గ్రామంలోని కోసూరి అంజి ప్రసాద్ ఇంటికి వెళ్ళి వారి వివాహం, కట్నకానుకలు గురించి మాట్లాడుకున్నారు. దీంతో అంజి ప్రసాద్ ఆ యువతి ఇంటికి వచ్చి వెళ్తూ ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరకంగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేశాడు. తరువాత ఆమెను పెండ్లి చేసుకోవడానికి నిరాకరించి మోసం చేసి పెద్దల్లో పెట్టి అడిగించినా నిరాకరించాడు. దానిపై ఆ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో జీలుగుమిల్లి పోలీసు స్టేషనులో ది.20-04-2021వ సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.విశ్వనాథ బాబు కేసు నమోదు చేసి అప్పటి పోలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏఎన్ఎన్.మూర్తి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అనంతరం సాక్షులను విచారించి పూర్తి దర్యాప్తు రిపోర్టును కోర్టులో దాఖలు చేశారు. నిందితుడు కోసూరి అంజి ప్రసాద్ అత్యాచారంకు పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ 10సం.లు కారాగార శిక్ష, మరియు రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. యువతిని నమ్మించి మోసం చేసిన సెక్షన్ ప్రకారం ఒక సంవత్సరాలు జైలు విధించారని, వరకట్నం డిమాండ్ చేసినందుకు ఆరు నెలలు జైలు మరియు 1000 రూపాయలు జరిమానా విధించారు. కోసూరి అంజి ప్రసాద్ తల్లిదండ్రులైన కోసూరి రామలక్ష్మి, సాంబశివరావులకు అదనపు కట్నం డిమాండ్ చేసిన సెక్షన్ ప్రకారం ఆరు నెలలు జైలు, 1000 రూపాయిలు చొప్పున జరిమానా విధించారు.

నోటీస్

మహారాజశ్రీ ఫ్యామిలి జడ్జి మరియు iv ADJ వారి కోర్టు : విజయవాడ

F.C.O.P. No. 1272/2024

Between:

పూప్పాల సుష్మిత రాణి ...పిటీషనర్

మరియు

మారిశెట్టి శరణ్ కుమార్ ....రెస్పోండెంట్

S/O నాగరాజు డోర్ నెం:6-71, మెయిన్ రోడ్, యేసుగువారిలంక, యలమంచలి, వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్-534275... పై వారికి

ఈ పిటీషన్ పరిహారం నిమిత్తము ది.02-07-2025న ఉదయము 10-30 గంటలకు, వాయిదా వేసి యున్నారు కావున స్వతహాగా గాని, సంపూర్ణంగా సంజాయిషి పొందిన అన్నీ ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడర్ ద్వారా గాని హాజరగుటకున్ను వాయిదా వేసి ఉన్నారు, పై చెప్పబడిన తేదీ నందు మీరు హాజరుకాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్షమున పై వజ్యమును విమర్శ చేసి తీర్మానము చేయుటజరుగునని మీకు పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

వాయిదా: 02-07-2025, ఉ॥10-30 గం॥లకు

// By Order //

పి.వై.కిరణ్ కుమార్, అడ్వకేట్, అజిత్‌సింగ్‌నగర్, విజయవాడ-15

ఫోన్ నెం: 7995003145

పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభం

విశాలాంధ్ర- పాలకోడేరు : ఉండి శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఆదేశానుసారం పాలకోడేరు మండలంలోని గొరగనమూడి గ్రామంలోని ప్రధాన పంట కాలువలోని పూడిక తీత పనులు ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కమిలి రాంబాబు చేతుల మీదగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని ప్రధాన పంట కాలువలను ప్రక్షాళన చేసే దిశగా శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు కంకణం కట్టుకున్నారని దానికనుగుణంగా మొదటిగా పాలకోడేరు మండలంలోని గొరగనమూడి గ్రామంలో పంటకాలువ పూడిక తీత పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాసవి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: కుటుంబానికి ఒక ఉద్యోగం అన్న ధోరణిలో నియోజకవర్గంలోని ప్రతి పౌరుడు ఆలోచన చేయాలని తద్వారా ఆంధ్రరాష్ట్రంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలుస్తుందని రాష్ట్ర విప్ ,శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.గురువారం స్థానిక వాసవీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహం చారు. ప్రతి నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచనలతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ 100 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ కారిడార్ గా కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. తద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు.యువత తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఉద్యోగాల వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్ల బాబి,పై బోయిన వెంకటరామయ్య, చాపల రమేష్, గట్టెం నాని ,అడ్డ గర్ల సురేష్, ఎర్రం శెట్టి శ్రీను, ,యంత్రంపాటి, ముఖేష్ వాసవి కాలేజ్ యాజమాన్యం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన చేపల లోడు లారీ

విశాలాంధ్ర - నిడమర్రు: కొల్లేరు నుండి చేపల లోడుతో నిడమర్రు వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించబోయి అదుపు తప్పి కాలువలో లారీ బోల్తా పడింది. లారీలో ప్రయాణిస్తున్న డ్రైవర్ క్లీనర్ కి ఎటువంటి గాయాలు అవ్వకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన తన స్థలానికి నిడమర్రు తహసిల్దార్ ఎన్ నాగరాజు, ఆర్ ఐ సుబ్బారావు, విఆర్ఓ, సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు.

గణితం పరీక్షలకు 892 మంది గైర్హాజరు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : యస్.యస్.సి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గురువారం జరిగిన గణిత పరీక్షకు 3856 మంది విద్యార్థులకు గాను 2964 మంది విద్యార్థులు హాజరు కాగా 892 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. యస్.యస్.సి. (ఎ.పి.ఓ.యస్.యస్) పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జరిగిన గణిత పరీక్షకు 378 మంది విద్యార్థులకు గాను 294 మంది విద్యార్థులు హాజరు కాగా 84 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియేట్ (ఎ.పి.ఓ.యస్.యస్) పబ్లిక్ పరీక్షకు సంబంధించి జరిగిన భౌతిక శాస్త్రము, రాజనీతి/ పౌర శాస్త్ర పరీక్షకు 620 మంది విద్యార్థులకు గాను 528 మంది విద్యార్థులు హాజరు కాగా 92 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.వి.వి.ఎన్.ఎన్.ఎన్.ఎన్.బి.ఎల్.నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు.

రైల్ హాల్టులను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర – కొవ్వూరు : ప్రాచీన చరిత్ర ఉన్న కొవ్వూరు పట్టణంలో 2019 నాటి రైల్ హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ కు వినతి పత్రం అందజేసిన కొవ్వూరు రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు గురువారం కొవ్వూరు పట్టణంలోని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్‌ను వారి నివాసంలో కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్లు ఆపకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను, తెలియజేశారు. 2019 కరోనాకు ముందు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 34 రైలుహాల్ట్‌లు ఉండేవని, కరోనా సమయంలో నిలిపి వేసిన రైల్వే హాల్టులను పునరుద్ధరించి కొవ్వూరు పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలకు మేలు చేయాలని కోరారు ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ మాట్లాడుతూ కొవ్వూరు విశిష్టత కలిగిన పట్టణమని, రైల్ హాల్టిల్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు, రైల్వే మంత్రి వర్యులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో. హాజీబు జగన్నాధ రావ్, గారపాటి రామ్మోహన్ రావ్, విల్సన్ రాజ్, రావు, మూర్తి, తరుణ్ కుమార్, రామారావు, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గ్రంధాలయాలు విజ్ఞానానికి దోహదం

విశాలాంధ్ర – దేవరపల్లి : గ్రంధాలయాలు విజ్ఞానానికి ఎంతో దోహదపడతాయని గ్రంధాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు అన్నారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెం శాఖా గ్రంధాలయంలో యాసవి శిక్షణ శిబిరంలో కార్య క్రమంలో భాగంగా గురువారం జిల్లా గ్రంధాలయ సమస్త కార్యదర్శి ఎం శేఖర్ బాబు హాజరై విద్యార్థులకు వివిధ సూచనలు సలహాలను ఇచ్చారు. విద్యార్థి దర్శించే గ్రంథాలయాలు పుస్తకం పట్టణ వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని విద్యార్థులు సదివినయనం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయ న సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అనిత వ్యాయామ ఉపాధ్యాయులు మురళి సుగుణ విద్యార్థులు పాల్గొన్నారు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర – గోపాలపురం : కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించు కున్నందుకు జూన్ నెల 5న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశానికి తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ గజిటేట్ ఉద్యోగుల సంఘం గోపాలపురం తాలూకు కార్యదర్శి నల్లరాజు పిలుపునిచ్చారు. స్థానిక గోపాలాపురం తహసిల్దార్ కార్యాలయం వద్ద కమిటీ కార్యదర్శి కె.నల్ల రాజు గోపాలపురం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలోని సిబ్బంది కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. పాత్రికేయులతో కార్యదర్శి నల్లరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఉద్యోగుల డిమాండ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వీటి సాధనకై జూన్ 5 న జరగనున్న 3 వ కౌన్సిల్ మీటింగ్, విజయవాడ కు ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. పాత పిఆర్సి విధానాన్ని అమలు చేయాలని డిఎ బకాయిలను తక్షణమే చెల్లించాలని. పిఆర్సి విషయంలో కమిషన్ వేసి ఉద్యోగులకు మేలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె అజయ్ బాబు, ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాయిల్‌లెస్ మీడియా వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర – కడియం : నర్సరీ రైతులకు మట్టికి బదులుగా కంపోజిటెడ్ లిగ్నైటెడ్ మిశ్రమాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు వివరంగా ప్రాజెక్టు రిపోర్ట్ ఇవ్వాలని పెలాసిస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ ను, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప కోరారు. కేరళకు చెందిన డాక్టర్ సిఎన్ మనోజ్, వారి టీమ్ సభ్యులు గురువారం ఉదయం కడియపులంక నర్సరీ అసోసియేషన్ ఆఫీసుకు విచ్చేసారు. వారికి నర్సరీ సంఘం అధ్యక్షులు రత్నం అయ్యప్ప స్వాగతం పలికారు. కడియం నర్సరీ రంగంలో మట్టి విషయంలో ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను చర్చించారు. మట్టికి ప్రత్యామ్నాయంగా లభించే కోకోపిట్, రైస్ రస్క్, పీట్ మాస్ లను కొందరు రైతులు వాడుతున్నారని వివరించారు. అదే విధంగా ఇతర రాష్ట్రాలలో సాయిల్ లెస్ మీడియాను ఉపయోగించి చేస్తున్న వ్యవసాయ పద్ధతులను గురించి చర్చించారు. సాయిల్ లెస్ మీడియాని పైలెట్ ప్రాజెక్టుగా ముందుకు తీసుకువెళతామని తెలిపారు. ఇది వినియోగం లోకి వస్తే, మొక్కకు అవసరమైన మైక్రో న్యూట్రియన్స్ పుష్కలంగా లభిస్తాయని, వర్మి కంపోస్ట్ వంటి వాటి అవసరం ఉండదని తెలిపారు. అంతే కాకుండా రైతులకు రవాణా తదితర ఖర్చుల భారం తగ్గుతుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రాసెస్సింగ్ యూనిట్స్ స్థానికంగా ఏర్పాటు చేసి, ఈ మిశ్రమాన్ని తయారు చేసి, రైతులకు అందించాలనే విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, రత్నం బాబ్జి, పిల్లా శ్రీనివాస్, అగ్రిషాప్ ఎండి నాగేంద్ర పాల్గొన్నారు.

నిస్వార్ధ నేత దత్తుడు శ్రీను: ఎమ్మెల్యే

విశాలాంధ్ర – అనపర్తి : పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ మొదటి నుండి పార్టీ వెన్నంటి ఉండి ప్రజా సేవ అందిస్తున్న నిస్వార్ధ నేత దత్తుడు శ్రీను అంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొనియాడారు. బుధవారం మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను) జన్మది నోత్సవం సందర్భంగా ఆయనతో ఎమ్మెల్యే నల్లమిల్లి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కర్రి శేషారత్నం,వర్తక సంఘం అధ్యక్షులు కొవ్వూరి వెంకట రామారెడ్డి, ఒగిరెడ్డి రాధ, సత్తి దేవదాన రెడ్డి,కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి ఆదినారాయణ రెడ్డి, మేడపాటి సత్యనారాయణ రెడ్డి (అన్నవరం), కర్రి సూర్యనారాయణ రెడ్డి ఎన్‌డిఏ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నందేవుల చంటికి జీవవైవిధ్య పురస్కారం

విశాలాంధ్ర – కడియం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన జీవవైవిధ్య పురస్కారం– 2025ను గురువారం కడియం మండలం, మాధవరాయుడు పాలెం గ్రామ సర్పంచ్ అన్నందేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జీవవైవిధ్య పరిరక్షణ కోసం పాటుపడుతున్న పలువురు విశిష్ట వ్యక్తులకు ఈ సందర్భంగా పురస్కారాలు అందించారు. దీనిలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ, విస్తారంగా మొక్కలు పెంచుతూ, పక్షులను, జీవులను సంరక్షిస్తూ, సాంప్రదాయ జానపద కళలను ప్రోత్సహిస్తూ, ప్రకృతి వనరులను సంరక్షిస్తున్న రైతు అన్నందేవుల చంటి కూడా ఈ విశిష్ట వ్యక్తుల జాబితాలో ఎంపిక కావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చంటిని ఘనంగా సత్కరించి అవార్డును బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి అధ్యక్షులు నీలాయపాలెం విజయ్ కుమార్, సభ్య కార్యదర్శి పి రామకృష్ణ, రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర – అనపర్తి : శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రామవరంశ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి,తేనెల శ్రీను పాల్గొన్నారు.

మృతిని కుటుంబానికి దివాన్‌చెరువు ఆటో యూనియన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర – రాజానగరం : ఒక వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే తన బంధువులే పట్టించుకొని సంఘటనలు ప్రస్తుతం చాలానే చూస్తుంటాం. అయితే అందుకు భిన్నంగా స్నేహితుడు మరణ వార్త విని చలించిపోయిన దివాన్ చెరువు గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆటో వర్కర్స్ యూనియన్ మానవత్వం చాటుకుంది. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని సదరు ఆటో యూనియన్‌కి చెందిన ఆటో డ్రైవర్ దొడ్డి శివప్రసాద్ ఇటీవలే గుండె పోటుతో అకాల మరణం చెందారు. దీంతో స్నేహితుడు కుటుంబాన్ని ఆదుకోవడానికి మృతిని పిల్లల చదువుల నిమిత్తం ఆటో యూనియన్ కార్మికుల సహకారంతో రూ.70 వేలు నగదును అతని కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు,టిఎన్టియుసి జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ తోటి మిత్రుడు, యూనియన్ సభ్యులు దొడ్డి శివ ప్రసాద్ మరణం అత్యంత బాధాకరణం అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు అర్హులైతే వాటిని కుటుంబ సభ్యులు పొందేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు చిలకసాని రాంబాబు, నిర్మాణాత్మక కార్యదర్శి కొప్పర్తి సూరిబాబు, కోశాధికారి మారిశెట్టి శ్రీనివాస్, సలహాదారులు నాగు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తలే వైసీపీకి వెన్నెముక

విశాలాంధ్ర – కడియం : కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, రానున్నది వైసిపి కార్యకర్తల ప్రభుత్వ మని వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన కడియం గ్రామంలోని గిరజాల కృష్ణ ప్రసాద్ కళ్యాణ మండపంలో, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో, వైసీపీ కడియం మండల అధ్య క్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం వైసిపి కడియం మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మృతి చెందిన కడియం మండల వైసీపీ కార్యకర్తలకు నివాళులర్పించారు.

పంచాయతీ ఎన్నికలపై టీడీపీ తీర్మానం అభినందనీయం

విశాలాంధ్ర – కాకినాడ : మండలంలోని ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వ హించాలని స్థానిక గోదావరి కళాక్షేత్రం లో జరిగిన టిడిపి మినీ మహానాడు లో తీర్మానం చేయడం పట్ల మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రమణయ్య పేటలో జరిగిన కార్యక్ర మాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండలంలోని రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ గ్రామ పంచాయతీలకు గత 13 సంవత్సరాలుగా కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం పేరుతో ఎన్నికలు నిర్వహిం చడం లేదని అన్నారు. హైకోర్టు తీర్పును అనుసరించి ఈ ఆరు గ్రామ పంచాయతీలను నగర పాలక సంస్థలో విలీనం చేసే అవకాశం లేనందున పంచాయతీలకు ఎన్ని కలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. పంచాయతీ ఎన్ని కలు జరపక పోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధులు గత మూడు సంవత్సరాలుగా విడుదల నిలిచిపోయాయని అన్నారు. ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు పిల్లి సత్తిబాబుకు అడబాల కృతజ్ఞతలు తెలిపారు.

గోగులమ్మ జాతర కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర – రాజానగరం : మండల కేంద్రమైన రాజానగరంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీశ్రీశ్రీ గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ చేతులు మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక శ్రీశ్రీశ్రీ గోగులమ్మ అమ్మవారు మరియు శ్రీ వీరభద్ర స్వామి వార్ల జాతర మహోత్సవం వేడుకలు జూన్ 7, 8 తారీకులలో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఐసి అధికారులకు ఏజెంట్ల ఘన స్వాగతం

విశాలాంధ్ర - అమలాపురం : రాజమండ్రి డివిజన్ నూతన సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా బాధ్యతలు తీసుకొని తొలిసారి గురువారం అమలాపురం బ్రాంచ్‌కి విచ్చేసిన సత్యనారాయణ సాహుకి మార్కెటింగ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ఎస్ఎస్ శర్మకి అమలాపురం ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఇండియా యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు ఘనంగా ఆహ్వానించి వారిని దుస్సలువతో ఘనంగా సత్కరించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ మాట్లాడుతూ డివిజన్లో ఒక ప్రత్యేకమైన స్థానం అమలాపురం బ్రాంచ్‌కి ఉందని దానిని ఆస్థానంలో ఉంచుటకు నా వంతు పూర్తి సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం బ్రాంచ్ మేనేజర్ కె సుధాకర్ రెడ్డి, అంబాజీపేట మేనేజర్ రవీంద్ర కుమార్, ఏబీఎం వి ప్రసన్నకుమార్, ఏఓఐ యూనియన్ ట్రెజరర్ బొమ్మ శివ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ నాగేంద్ర కుమార్, సెక్రెటరీ జి వినాయకరావు, మధు, ఏసుదాస్, శ్రీనివాస్ గౌడ్, వీరస్వామి, శ్రీనివాసరావు, కేవీన్ శెట్టి లంకేశ్వరుడు, యోహాన్ రామకృష్ణ మరియు అధిక సంఖ్యలో ఏజెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ మహానాడు

– ఆకట్టుకున్న పలువురి ప్రసంగాలు

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : టీడీపీ నిర్వహించిన కాకినాడ జిల్లా మహానాడు-2025 విజయవంతం అయింది. ఈ మహానాడులో పలువురు నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. గురువారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో నిర్వహించిన కాకినాడ జిల్లా టీడీపీ-2025 మహానాడును ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు ఘన నివాళి అర్పించారు. అలాగే టీడీపీ జెండా మోసి అశువులు బాసిన కార్యకర్తలకు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు కొంత సేపు మౌనం పాటించారు. మహానాడు కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యేలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వరుపుల సత్యప్రభ, వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), నిమ్మకాయలు చినరాజప్పలతో పాటు ఇన్చార్జిలు, ప్రముఖులుగా వ్యవహరిస్తున్న వారు ఆయా నియోజవర్గాలలో ఉన్న సమస్యలను లేవనెత్తారు. వారిలో ముఖ్యంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఆకట్టుకుంది. రాజకీయం తీర్మానంపై మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గత సీఎం జగన్ తన అవివేకతనంతో నాశనం చేసి రాష్ట్రాన్ని అధోగది పాలు చేశారన్నారు. 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు. వాటికి ప్రజల నుంచి వచ్చిన పన్నులను వడ్డీలుగా చెల్లిస్తున్నామన్నారు. దేశంలో అందరికంటే ఎక్కువగా 32 వేల కోట్లు రూపాయలు పింఛన్లకు ఇస్తున్నామని వచ్చే నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెస్ఎంఇ పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించుతున్నట్లు చెప్పారు. 2047కి దేశంలో మన రాష్ట్రం అభివృద్ధిలో అగ్రభాగంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు చిక్కాల రామచంద్రరావు, ఎస్విఎస్ఎన్ వర్మ, పిల్లి సతీబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబి, మహాసేన రాజేష్, తోట నవీన్, సుర్ల లోవరాజు, తుమ్మల సునీత, వేటుకూరి నాగమణి, వనమాడి మోహన్ వర్మ, ఎస్విఎస్ అప్పలరాజు, పోతుల మోహన్రావు, పెంకే శ్రీనివాస్ బాబా, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీఆర్తో కలిసి పని చేసిన సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూలను ఘనంగా సన్మానించారు.

సీఎం సహాయనిధి అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలై, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న మేడపాడు గ్రామానికి చెందిన మల్యాల సీతాలక్ష్మి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.55,206ల చెక్కును రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు టీడీపీ నాయకుడు వల్లూరి శ్రీనివాస్, ఆనంద్ న్యూటన్ అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి గొప్ప ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ వైద్య సేవలను కోల్పోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడతామని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సమస్యలపై మండల పరిషత్ సభ్యులు ఏకరువు

విశాలాంధ్ర - కాట్రేనికోన : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఎంపీటీసీలు, సర్పంచులు ముక్తకంఠంతో నిలదించారు. గురువారం ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన కాట్రేని కోన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై అధికా రులను సభ్యులు నిలదీశారు. గత మూడు ఏళ్లలో మండల పరిషత్‌లో అభి వృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎంత సొమ్ము వెచ్చించారో వివరాలు తెలపాలని కాట్రేనికోన ఎంపీటీసీ మోకా చంద్ర నాగరత్నం అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ సమస్యలపై ఎన్నిసార్లు ఫోన్ చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యుత్తు లైన్‌మెన్లు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని, ప్రజా సమస్యల పరిష్కరించలేని తాము ఇక ఎందుకని ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, ఎంపీటీసీ సభ్యుడు సంఘాని మునీంద్ర వర్మ నిరసన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉందని ఇకపై ఆలా జరగకుండా చర్యలు తీసుకుంటానని ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. వ్యవసాయ పనుల కాలంలో ఉపాధి హామీ పనులు చేపట్టడం పట్ల జడ్పిటిసి నెల కిషోర్ కుమార్, ఎంపీటీసీ గెద్దాడ గుణవేణు కుమార్ ఉపాధి హామీ ఏపిఓ దృష్టికి తీసుకుని వచ్చారు. ఉపాధి హామీ పనులు నాణ్యతగా చేయాలని, అధికారులు పర్యవేక్షణ చేయాలని వేణు కుమార్ కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బదులు ఇచ్చారు. బలుసుతిప్ప-కాకినాడ బస్సు సౌకర్యం కల్పించాలని బలుసుతిప్ప ఎంపీటీసీ కోరారు. జేఎంఎంలో భాగంగా కాట్రేనికోన పంచాయతీ పరిధిలో వేట్లపాలెం గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ 2 సానబోయిన నాగేశ్వర రావు సభలో కోరారు. ఇతర శాఖల అధికారులు తమ శాఖాలలో జరుగుతున్న పనులు వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకట చలం, తహసీల్దార్ సునీల్ కుమార్, అధికారులు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, వేణు, శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన రామచంద్ర పురం డివిజనల్ అధికారి అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రామచంద్ర పురం డివిజనల్ రెవెన్యూ అధికారి డి అఖిల ఆకస్మి కంగా తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్ ఫార్మసీ, ప్రసూతి విభాగాలను తనిఖీ చేసి, పేషెంట్లకు అందుతున్న సేవలను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా డివిజనల్ అధికారి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించు టలో తగు సూచనలు, సలహాలను పాటిస్తూ, ప్రగతిలో అభివృద్ధిని సాధిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని డాక్టర్ పిఎన్ఎస్ డి రత్నకుమారికి, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరపురం తాహసీల్దార్ చిన్నారావు, రామచంద్రపురం డివిజనల్ అధికారి డాక్టర్ ఎన్ ప్రశాంతి, డివిజనల్ సూపర్వైజర్ జి కమల శేషు, అంగర పిహెచ్‌సి ఎంపీహెచ్ఇఓ జె మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి రామారావు, హెల్త్ విజిటర్ టీ మేరీ మణి, స్టాఫ్ నర్స్ బంగారు పాప, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ అలీ మరియు ఇతర సిబ్బంది, అంగర విఆర్ఓ పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధి చేసేందుకు చర్యలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఉప్పాడ తీర ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మా టూరిజం మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ పద్మజ రాణి అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల్లో పర్యటించారు. చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలించి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల గ్రామాల్లో పర్యటించి వారి జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అమీనాబాద్ ఆర్బర్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో పర్యటించామన్నారు. ఈ ప్రాంతంలో వసంతం మత్స్యకారులు, చేనేత కార్మికుల అభివృద్ధికి ఏ ప్రణాళిక రూపొందించాలి అనే విషయాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా టూరిస్ట్ సంబంధించి ప్రతిపాదన సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో రవికుమార్. సర్పంచులు, జనసేన నాయకులు, పనసకల అధికారులు పాల్గొన్నారు.

గల్లంతైన శ్యామ్ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : సముద్రంలో బోటుపై వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బోటు బోల్తాపడి గల్లంతైన మెరుగు శ్యామ్ మృతదేహం (19) గురువారం లభ్యమయింది. మండలంలోని ఉప్పాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు మెరుగు శ్యామ్‌తో పాటు మరో ఇద్దరు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. అయితే వేట ఆడుతుండగా ప్రమాసాత్తు బోటు బోల్తా పడింది. ఈ సంఘటనలో మరో ఇద్దరు మచ్చ కారులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. అల ఉధృతి కారణంగా శ్యామ్ సముద్రంలో గల్లంతయ్యాడు. గత రెండు రోజుల నుంచి మత్స్యకారులు బోట్లపై గాలించగా గురువారం ఉదయం శ్యామ్ ఉదయం అయింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ఐటీఐ విద్యార్థి పరమేశ్వర్, డీసీపీయూ సిబ్బందిని సత్కరించిన కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : గత మంగళవారం కాకినాడ ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఏ దిక్కు లేక ముగ్గురు చిన్నారులతో వర్షంలో ఆకలి, అనారోగ్యానికి గురయ్యారైన తన బిడ్డల దుస్థితి చూసి రోదిస్తున్న జిల్లా రామలక్ష్మి తన ముగ్గురు బిడ్డల పరిస్థితి చూసి ఎవరూ స్పందించకపోవడంతో అక్కడే ఉన్న గంగవరం మండలం కుందూరు సావారానికి చెందిన వనుము పరమేశ్వర్, మత్స్యకారుడు రాజు వెంటనే స్పందించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు ఆ ఒంటరి మహిళను తన చిన్నారులను డీసీపీయూ బృందంతో కలిసి జీజీహెచ్‌లో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌కి తరలించి సపర్యలు చేసి, చిన్నారికి చికిత్స అందించారు. బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు సఖి వన్ స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షణ కల్పించారు. ఈ విషయాన్ని దినపత్రికల ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..సీపీవో పీ త్రినాథ్‌తో కలిసి ఐటీఐ మూడో సంవత్సరం చదువుతున్న వనుము పరమేశ్వర్, ప్రొటెక్షన్ అధికారి కె విజయలను ప్రత్యేకంగా సత్కరించారు. ఇటువంటి సేవాగుణంతో భవిష్యత్తులోను కొనసాగించాలని, మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఐటీఐ విద్యార్థి పరమేశ్వర్‌కు సూచించారు. డీసీపీయూ సిబ్బంది జిల్లాలో ఇటువంటి నిస్సహ్య పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి ఇదే అంకిత భావంతో సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీయూ కౌన్సిలర్ బి దుర్గా రాణి, సోషల్ వర్కర్ ఎస్ చినబాబు, ఔట్‌బ్యూఆర్ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికపై ఎంపీ గంటి హరీష్ మాధుర్

విశాలాంధ్ర - అమలాపురం : దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ, అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక ఏకగొంతి సందే శాన్ని వినిపించే అవకాశం లభించడం గర్వకార ణంగా, అదే సమయంలో బాధ్యతగా భావిస్తున్నా నని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికపై మాట్లాడే అవ కాశం తనకు ఇండియా తరుపున అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమయంలో నాకు ఎంతో ప్రత్యేకం. గురువారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి వారి ఆశీర్వాదం కోరారు. ఈ విషయం విన్న వెంటనే ఆయన ముఖంలో కనిపించిన ఆనందం నాకు ఎంతో ప్రోత్సాహం, ధైర్యాన్ని ఇచ్చింది. ఆయన ఇచ్చిన ఆశీస్సులు నాకు మరింత బలానిచ్చాయని ఎంపీ హరీష్ అన్నారు. ఈ అవకాశాన్ని ఒక ఎంపీగా కాకుండా, మన జీఎంసి బాలయోగి కుమారుడిగా పొందినందుకు నాకు మరింత గర్వకారణంగా ఉందని అన్నారు. అప్పట్లో టీడీపీ-ఎన్డీఏ కూటమి పాలనలో లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. దేశం తరపున ప్రపంచ వేదికలపై మన గొంతును వినిపించే అవకాశం కల్పించ టం ఆనందంగానే గర్వంగా ఉందని ఎంపీ గంటి హరీష్ అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

– మినీ మహానాడులో అచ్చం నాయుడు

విశాలాంధ్ర – అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా మినీ మహానాడు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగినది. జిల్లా మినీ మహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి కె అచ్చం నాయుడు పాల్గొన్నారు. గురువారం అమలాపురం క్షత్రియ పరిషత్ హాలులో జరిగిన జిల్లా మినీ మహానాడులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పి గన్నవరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ నామన రాంబాబు పాల్గొని సూపర్ 6 పథకాల గురించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నామన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వం ఒక వైపున అభివృద్ధి కార్యక్రమాలను అమ లు చేస్తూనే, మరొకపక్క సంక్షేమ కార్య క్రమాలను నిర్విఘ్నంగా పూర్తి చేయడానికి సంసిద్ధతతో ఉంటూ, ఇప్పటివరకు దశలవారీగా ఈ సూపర్ 6 పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, త్వరలోనే మిగతా పథకాలను కూడా ప్రవేశపెడతామని చెప్పి తీర్మానం చేయడమైనది. జిల్లా మినీ మహానాడులో ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణ బాబు, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నాయకులు, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా ఇసుక మేటలు

- అధికలోడ్తో రోడ్డుపై చేరుతున్న ఇసుక
- సంబంధిత అధికారులు నిఘా నిల్
- నిబంధనలకు విరుద్ధంగా రవాణా

విశాలాంధ్ర – సీతానగరం : రోడ్డు పై ప్రమాదకరంగా ఇసుక మేటలు. వానొస్తే బురద ఎండొస్తే దుమ్ము మయంగా ప్రధాన రహదారి. మండలంలో కాటవరం, రాజంపేట గ్రామాలలో గత కొద్ది కాలంగా ఇసుక ర్యాంపుల నిర్వహణ జరుగుతుంది. అయితే ఈ ర్యాంపుల నుండి ఇసుక రవాణాకు పెద్ద డంపర్ లారీలను వినియోగిస్తున్నారు. ఈ లారీలకు 18 టన్నుల మించి ఇసుక రవాణా చేయకూడదు అని మోటార్ వెహికల్ చట్టంలో నియమ నిబంధనలు ఉన్నాయి. కానీ ఇవే ఏవీ తమకు పట్టవు అనట్టు ఒకో లారీకు 40 నుండి 50 టన్నులు లోడ్ తో యద్దేచగా రవాణా సాగిస్తున్నారు. ఈ రవాణా చేస్తున్న డంపర్ లారీల వెనుక క్యాబిన్ మించి లోడ్ వేయడంతో లారీల ప్రయాణం సమయంలో ఆ అధిక లోడ్ రోడ్డు పై పడి వాహన దారులకు ప్రమాదకరంగా మారుతుంది. ఈ ఇసుక రవాణా పై సంబంధిత శాఖ అధికారులు సరైన నిఘా లేకపోవడం వలనే నిబంధనలకు విరుద్ధంగా రవాణా సాగుతుంది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు మండల ప్రజల చిరకాల స్వప్నం అయినా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో పూర్తి కాకుండానే రోడ్డు మరమత్తుల పాలు అవుతుంది అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో సుమారు 4 సవంత్సరాలు పాటు మండల ప్రజలు పడిన కష్టాలు ఎన్నికటికి మరువలేనిది అని అలాంటి పరిస్థితులు మరళా ఎదురైతే ఊహించడానికే కష్టంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున అధికారులు, నాయకులు స్పందించి రోడ్డు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

24న జీ తెలుగు అప్సర అవార్డ్స్

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : వెండితెర, బుల్లితెర తారల సందడితో వైభవంగా జరిగిన జీ తెలుగు అప్సర అవార్డ్స్ ఈ నెల 24 వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్ పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్లో వేదికపైకి వచ్చి ప్రముఖ నటి రోజాకు అవార్డు అందించారు. జయప్రద, ఐశ్వర్య రాజేష్, అనిల్ రావిపూడితో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోని సీన్స్ని రీక్రియేట్ చేశారు. అమల అక్కినేని రవి, రోజాతో కలిసి డాన్స్ చేయడమే కాకుండా, జంతు సంరక్షణ, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. జయసుధకు అభిమానులు ఆటోగ్రాఫ్లతో అలంకరించిన చీరను బహుమతిగా ఇచ్చారు. రమ్యకృష్ణ నటించిన ప్రముఖ పాత్రలతో ఓ చక్కని ప్రదర్శన ఇచ్చారు. ఘనంగా జరిగిన ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులైన సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి, మురళీ మోహన్, అన్నపూర్ణ, స్వప్న దత్, ప్రియాంక దత్, జీవిత రాజశేఖర్, శివాని రాజశేఖర్, సుమ కనకాల, కోన వెంకట్, నిహారిక కొణిదెల, అనసూయ, డైరెక్టర్ నందిని రెడ్డి, రజిత, ప్రగతితో పాటు మరికొందరు నటీనటులు పాల్గొని సందడి చేశారు.

హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం, ట్రాఫిక్ రూల్స్ సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర – కాకినాడ టౌన్ : 22వ తేదీన, కాకినాడ-జిలాని సెంటర్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు. మోటార్ సైకిల్, కార్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుత డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని, మీఎ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలియజేశారు.

తదుపరి : సైబర్ నేరాలలో భాగముగా : 1) ఆన్లైన్ మోసాలు, 2) ఫేక్ లోన్స్ మోసాలు, 3) ఆన్లైన్ జాబ్స్, వర్క్స్, 4) డిజిటల్ అరెస్టు, 5) 112/100, 1930, 1972 కాల్స్ ఉపయోగములు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బోసుబాబు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల ఎర్నగూడెం మధ్య ఉన్న హనుమాన్ చింత చెట్టువద్ద గురువారంనాడు హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభంగా నిర్వహించారు పల్లంట్ల ఎర్నగూడెం రోడ్లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం స్వామివారికి ప్రత్యేకించి లక్ష తమలపాకులు సింధూరంతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మొకప్పాటి సురేష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. మేడికొండ చిన కృష్ణారావు దంపతులు వల్లభనేని వెంకటరమణ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గడ రామచంద్రం మొగలపు హనుమంతు మొగలపు శ్రీనివాస్ రేలంగి శ్యాంబాబు మొక్కపాటి శ్రీనివాసరావు మేడికొండ కృష్ణారావు వల్లభనేని రమణమూర్తి ఆల్ ఇండియా విష్ణు సహస్రనామ ఫెడరేషన్ డైరెక్టర్ బలుసు సత్యనారాయణ తెలుగుదేశం నాయకుడు కొయ్యలమూడి చినబాబు కొయ్యలమూడి సురేంద్రనాథ్ చటర్జీ మాజీ ఏఎంసి చైర్మన్ గన్నమని జనార్దన్ రావు కూచిపూడి సతీష్ స్థానిక ప్రముఖులు మహిళలు పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతులు హనుమాన్ చింతవద్ద సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పల్లంట్లదేవరపల్లి కురుకూరు కృష్ణం పాలెం, ఎర్నగూడెం గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లి : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో చెరువు గట్టుపై వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బొల్లం రెడ్డి రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లేపల్లి గ్రామం, జాతీయ రహదారి పక్కన వెలసిన, అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కమిటీ సభ్యులు, దార్లంక శ్రీనివాసరావు, జాజి మొగ్గల సత్యనారాయణ, వలబశెట్టి చక్రరావు, అక్కిరెడ్డి సత్తిబాబు, తెమ్మనబోయిన జయ, నానాజీ, పి పవన్ కుమార్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం తెల్లవారు జామున స్వామివారికి దార్లంక మాణిక్యం బేబీ, చెల్లూరి శీను కృష్ణవేణి దంపతులు, స్వామి వారికి ప్రత్యేక పూజలు, సింధూర పూజ, అభిషేకాలు నిర్వహించారు.

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలు కన్నుల పండుగ జరిగాయి హనుమాన్ భక్తులు ఉదయం నుండి ఆలయాలను సుందరంగా అలంకరించి హనుమంతునికి పూజలు, అభిషేకాలు చేశారు. పరమపవిత్రుడైన రామభక్తునికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ ఆధ్వర్యంలో పట్నంలో ఊరేగింపు జరిగింది. సాయంత్రం పట్టణం అతా శోభాయాత్ర జరిగింది. భక్తులు పాల్గొని హనుమంతునికి పూజలు చేశారు. పుల్లయ్య రామాలయం, గడియార స్తంభం సెంటర్, హైస్కూల్ సెంటర్, పలుచోట్ల పూజలు చేశారు.

పరిశ్రమల మంజూరుకు ప్రతి అంశాన్ని పరిశీలించాలి

- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో సిం గిల్ విండో కింద పరిశ్రమల స్థాపనకు, ఇతర ప్రోత్సాహకాల మంజూరు విష యంలో ప్రతిఅంశాన్ని క్షుణంగా పరిశీ లించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచిం చారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురు వారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమి టీ సమావేశం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశ్రామికా భివృద్ధికి రాష్ట్ర ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతననుసరించి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రా మికవేత్తల దరఖాస్తులను పరిశీ లించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు సింగిల్ విండో పథకం ద్వారా నిర్దేశించిన సమ యంలోగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. సింగిల్ విండో కింద అందిన 84 దరఖాస్తుల్లో ఇప్పటికే 51 దరఖాస్తులు ఆమోదం పొందగా మిగిలిన 33 దరఖాస్తు లనుత్వరితగతిన పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సుబ్రహ్మ ణ్యేశ్వరరావు, ఎల్డిఎమ్ డి. నీలాద్రి, ఏపీఐఐసి కార్పోరే షన్ ఈడి ఎం. ముక్కంటి, జిల్లా అగ్ని మాపక అధి కారి సిహెచ్. రత్నబాబు, నగరపాలక సంస్థ కమిషనరు భాను ప్రతాప్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్ట రీస్ ఆర్. త్రినాధరావు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

విశాలాంధ్ర- ఏలూరు: రక్తదానం చేయడం తన అదృష్టంగా భావిస్తానని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి పింగళి జోజి బాబు తెలిపారు.ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రిలో డెలివరీ మహిళకు అత్యవసరంగా 'బి'.పాజిటివ్ బ్లడ్ కావాలని ఫోన్ చేశారని తాను వెంటనే వెళ్లి రక్తదానం చేశానన్నారు. నేటికీ 37వసారి రక్తదానం చేశానని తెలిపారు.ఇన్నిసార్లు రక్తదానం చేసే అవకాశం తనకు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి అచ్చెన్నాయుడుకి ఘన స్వాగతం

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు విచ్చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘన స్వాగతం లభించింది. మంత్రి రావులపాలెం క్యాంపు కార్యాలయానికి చేరుకోగా, అక్కడ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంత్రి ఆత్మీయంగా స్వాగ తించారు. బండారు సంజీవ్ కూడా పూల మాల వేసి ఘనంగా ఆహ్వానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగింది. వేదికపై నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో హాజరయ్యారు. మంత్రి ప్రజలతో మమేకమ వుతూ వారి సమస్యలను ఆరాధించారు. ప్రజల అభ్య ర్థనలను శ్రద్ధగా విన్న మంత్రి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ కోన సీమ అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తు న్నట్లు తెలిపారు. రావులపాలెం ప్రాంత అభి వృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. పల్లెల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణలో పోలీస్, సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించారు. వాతావరణం ఉత్సాహభరితంగా, ప్రజా సమీకరణంతో నిండి కనిపించింది. అధికారులంతా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సభ ముగి సిన అనంతరం నాయకులు మీడియాతో మాట్లా డారు. సందర్శన సందర్భంగా జిల్లా అభివృద్ధి ప్రణాళి కలపై చర్చ జరిగింది. కూటమి నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రజల్లో నూతన ఆశలు రేపింది.

యోగాంధ్ర 2025 కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు

ప్రణాళిక ప్రకారం పని చేయాలి : కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : యోగాంధ్ర 2025 కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు ప్రణా ళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ షణ్మో హన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలె క్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఇతర ముఖ్య శాఖల అధికా రులతో కలిసి జిల్లాలో యోగఆంధ్ర 2025 కార్య క్రమంలో భాగంగా నిర్వహించనున్న యోగా శిక్షణా తరగతులు, వివిధ రకాల పోటీల తదితర అంశాలపై కలెక్టర్ అధికా రులతో చర్చించారు. ఈ సందర్భం గా కలెక్టర్ షణ్మోహన్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శ కాలకు అనుగుణంగా జిల్లాలో యోగా ఆంధ్ర 2025 కార్యక్రమం సక్రమంగా నిర్వహిం చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు సం బంధిత అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచే యాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 24 నుంచి ప్రతిరోజు యోగ పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. వివిధ రకాల పోటీలకు సంబంధించి గ్రామ స్థాయిలో మే 26 నుంచి 29 వరకు, మండల స్థాయిలో జూన్ 02 నుంచి 07 వరకుబీ జిల్లా స్థాయి పోటీలు జూన్ 09 నుంచి 14 వరకు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా శిక్షణ తరగ తులకు సంబంధించి యోగా ట్రైనర్లను ఏర్పాటు చేయాలని షణ్మోహన్ అధికారులకు సూచించారు. సమావేశం లో జిల్లా రెవెన్యూ అధి కారి జె వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో వి రవికుమార్, ఆయుష్ వైద్య అధికారి డా ఎంఎస్ ఆలీ, డీడీ ఐ అండ్ పీఆర్ డీ నాగార్జున, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకటరావు, కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకటేశ్వరస్వామి రథశాల నిర్మాణానికి

మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని గురువారం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణా ధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదా శీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటం అందజేసారు. ఏడు శనివారాల దేవుడిగా భక్తుల కోర్కెలు తీరుస్తున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటే శ్వరస్వామి వారి రథానికి రూ. 38 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రథ శాలకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరియు కొత్త పేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్‌లు శంకుస్థాపన చేశా రు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సైను అభినందించిన ఎస్పి బిందుమాధవ్

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల పరిధిలోని క్రైమ్ నివారణలో భాగంగా అహర్నిశలు కృషి చేసినం దుకు ఎస్సైను కాకినాడ ఎస్పి అభినందించారు. జిల్లా కేంద్ర మైన కాకినాడలో ఎస్పీ అధ్య క్షతన గురువారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో క్రైమ్ రేట్ తగ్గించినందుకు జగ్గంపేట ఎస్సై రఘునాథ రావును మనస్ఫూర్తిగా అభి నందించారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావుకు గతంలో జగ్గంపేట మం డలంపై పూర్తి అవగాహన ఉండటం వల్ల మండల పరిధి గ్రామాల్లో ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న వెంటనే స్పందిం చగల సమాచారాన్ని ఆయన రాబట్టుకోవడంలో దిట్ట అని పలువురు స్థాని కులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఉద్యోగి రెండోసారి బాధ్యతలు నిర్వహిం చడం సంతోషమన్నారు. అందువల్లే క్రైమ్‌రేటు తగ్గుముఖం పడుతుందన్నారు.

పూతరేకుల తయారీలో కల్తీ నెయ్యి కలకలం

- 101 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్న అధికారులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆత్రేయపురం పూతరేకుల తయారీలో కొంతమంది స్వార్థపరులు కల్తీ నెయ్యి వాడుతున్నట్టు మరోసారి బయట పడింది. ఇటీవల కాలంలో పలు దుకాణాల్లో పూత రేకుల తయారీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు దాడులు చేసి కొన్ని షాపుల్లో కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. తాజాగా స్థానిక లక్ష్మీ డ్రైఫ్రూట్స్ షాపులో కల్తీ నెయ్యి ఉందని స్థానికులే రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయ డంతో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎటువంటి బ్రాండ్ పేరు లేకుండా 66 కేజీలు, అదిర ఆదిర బ్రాండ్ 35 కేజీలు సుమారు మొత్తం 101 కేజీల కల్తీ నెయ్యి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసా రు. అలాగే స్థానిక దుకాణాల్లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించారు. కల్తీ నెయ్యి వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పూతరేకులు తయారీలో కల్తీ నెయ్యి వినియోగిం చకుండా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కరకుదురులో ఐదు కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - పెదపూడి : ఎస్సై రామారావు, డిప్యూటీ తహ సీల్దార్ ఆధ్వర్యంలో పెదపూడి మండలం కరకుదురు గ్రామ శివా రున పెదపూడి నుండి కాకినాడ పోవు రోడ్డుకు ఎడమ భాగంలో మూత పడిన పాత వైన్ షాప్ పై దాడి చేసి గురువారం ముగ్గురుని పట్టుకుని వారి వద్ద నుండి 5 కేజీల 152 గ్రాముల గంజాయిని స్వాదీనం చేసుకుని ఈ గంజాయితో సంబంధం వున్న మరో ఇద్దరితో కలిపి ఐదుగురిపై కేసు నమోదు చేసామని వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేస్తామని ఎస్ఐ తెలిపారు. అదే విదంగా ఎవరైనా గంజాయి అక్రమ రవాణాలో పాల్గుంటే వారిపైన కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడమే కాకుండా వారిపైన కూడా రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు.

ఏడిద నాగ భూషణం కుటుంబానికి

ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన అమినాబాద్ గ్రామానికి తొలితరం మాదిగ రిజ ర్వేషను పోరాట సమితి కార్యకర్త పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో వర్గీకరణ సాధన కోసం పోరాడిన ఏడిద నాగ భూషణం కుటుంబాన్ని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. కొండేపూడి కుమా రులు భూషణం కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ సందర్భంగా మాదిగ జిల్లా ఉద్యోగుల సమాఖ్య నాయకులు, కొండేపూడి శ్యాంబాబు కుమా రులు, కొండెపూడి రాజాజి రాయ్, రాహుల్ రాయ్ మాట్లాడుతూ ఎస్సి వర్గీ కరణ సాధనలో జీవితాలను అర్పించిన కార్యకర్తలను మాదిగ జాతి ఎప్పుడూ గుండెలలో పెట్టుకుంటుందని వారి త్యాగాలు వృధాపోలేదని కొండెపూడి రాజాజీ రాయ్ అన్నారు. వర్గీకరణ సాధనలో కుటుంబాన్ని సైతం పక్కన పెట్టి ఉద్యమం కోసం పోరాడిన ఏడిద నాగ భూషణం కుటుంబానికి ఎప్పుడూ అండగ వుంటామని భరోసా ఇచ్చారు. సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు జుత్తుక బాబురావు మాట్లాడుతూ తనతో కలసి పనిచేసిన క్షణాలు మరువ లేనని అయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మోర్త రవి మాదిగ, యంఇయఫ్, జిల్లా ఎంఈఎఫ్ ఆర్థిక కార్యదర్శి బెన్ జాన్సన్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మోర్త కోటి, దూలపల్లి సూరిబాబు, కొండెపూడి వీర్రాజు, ఏడిద కిరణ్, దొరబాబు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 1100 రైస్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో రైస్ కార్డులకు సంబంధించి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా సరాసరిన రోజుకు 1100 ధరఖాస్తుల వరకు స్వీకరిం చడం జరుగుతున్నదని జిల్లా పౌర సరఫరాల అధికారి శివరామమూర్తి తెలిపారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో ధరఖాస్తుల స్వీకరణ జరుగుతుం డటంతో సర్వర్ బిజీగా ఉండటంతో కొంత ఆలస్యం జరుగుతున్నదని,ఈ విష యంలో గ్రామ,వార్డు, సచివాలయాల సిబ్బంది అందరూ వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ధరఖాస్తుల స్వీకరణలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలియజేస్తున్నట్టు శివరామమూర్తి అన్నారు.

ఆదినాథ్ జైన్ దేవాలయాన్ని సందర్శించిన అజయ్ జైన్

విశాలాంధ్ర - కాళ్ళ : పెదమిరం ఆదినాథ్ జైన్ దేవాలయాన్ని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ సందర్శిం చారు. గురువారం కాళ్ళ మండలం పెదమిరం గ్రామం ఆదినాథ్ జైన్ ఆలయాన్ని సందర్శించి, ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వ రరావు, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఏ. లాజ్ వంతినా యుదు, మేనేజరు ఏ. రాజ్య లక్ష్మి, కన్సల్టెంటు డి. సాహితి, భక్తులు పాల్గొన్నారు.